# మాట ఇచ్చి నిలబెట్టుకున్న నారాయణగిరి సర్పంచ్..పుట్ట రేణుక కుమారస్వామి

## ప్రజా నమ్మకానికి ప్రతీకగా ప్రశంసలు



ధర్మసాగర్ (తెలుగు గళం), ఫిబ్రవరి 6:ప్రజలకు ఇచ్చిన మాటను కచ్చితంగా నిలబెట్టుకోవడం నిజమైన ప్రజా నాయకుల లక్షణమని మరోసారి నిరూపించారు ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామ సర్పంచ్ పుట్ట రేణుక కుమారస్వామి.ఎన్నికల సమయంలో గ్రామాభివృద్ధి, ముఖ్యంగా హరిజన స్మశాన వాటికలో నీటి సమస్య పరిష్కారమే తన ప్రథమ కర్తవ్యమని ఇచ్చిన హామీని గెలిచిన కొద్ది రోజుల్లోనే అమలు చేసి ఆదర్శ సర్పంచ్‌గా నిలిచారు.గత ఎన్నో ఏళ్లుగా హరిజన స్మశాన వాటికలో నీటి కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, ఆ సమస్యను స్వయంగా పరిశీలించిన సర్పంచ్ వెంటనే చర్యలు ప్రారంభించారు.హనుమకొండకు చెందిన దాత చందుపట్ల రఘుపతి రెడ్డిని ప్రోత్సహించి నీటి మోటార్ దాతగా ముందుకు తీసుకువచ్చి, గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో బోరు త్రవ్వించారు. బోరు విజయవంతం కావడంతో స్మశాన వాటికలో నీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమైంది.సర్పంచ్ తీసుకున్న ఈ చొరవపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, "మాట నిలబెట్టుకునే సర్పంచ్ దొరికారు" అని ప్రశంసిస్తున్నారు.ముఖ్యంగా హరిజనవాడ ప్రజలు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ, గ్రామాభివృద్ధికి ఆయన చూపుతున్న నిబద్ధతకు అభినందనలు తెలిపారు.ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావించి వెంటనే పరిష్కరించడం సర్పంచ్ నాయకత్వానికి నిదర్శనమని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సంధ్యా రాజి మారెడ్డి, మాజీ సర్పంచ్ బుద్దె రమేష్, వక్కల వీరయ్య, వక్కల సుధాకర్, వక్కల భద్రయ్య, వక్కల కర్ణాకర్, వక్కల రవి, చిట్యాల కృపానంద్, వక్కల వెంకటేష్, వక్కల అక్షిత్, కొలిపాక రాజు తదితరులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధి పట్ల సర్పంచ్ చూపుతున్న శ్రద్ధ ఇతర ప్రజా ప్రతినిధులకు ఆదర్శంగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# ఖమ్మంజిల్లా రవాణా శాఖ అధికారి జగదీష్ కి ఆటో, మోటార్ రంగాల జేఏసీ సమ్మె నోటీసు"

**సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి**

**కార్మికులకు అనువైన చోట అడ్డా లు ఏర్పాటు చేయాలి**

**కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 2019 రవాణా చట్టం రద్దు చేయాలి**




ఖమ్మం, ఫిబ్రవరి06(తెలుగు గళం)న్యూస్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికుల ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని జీవనభృతి 12000 చెల్లించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని,లి రవాణా రంగంలో ఆటో కార్మికులు ఎంతో కీలకపాత్ర వహిస్తున్నారని తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు వల్ల ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారని అన్నారు కిస్తీలు కట్టలేక ఫైనాన్స్ కట్టలేక ఆటోలను అమ్ముకొని రోడ్డున పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతోమంది కార్మికులు ఉపాధి కోల్పోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం మాత్రంస్పందించకపోవడం దుర్మార్గమని ఆయన అన్నారు.ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం ఎన్నికలలో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని ప్రతి ఆటో కార్మికునికి సంవత్సరానికి 12,000 జీవన భృతి వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శుక్రవారం ఆటో కార్మికులు కిరాయిలు లేక అడ్డాల మీద కూర్చుని ఏ కిరాయి దొరుకుతుందా ఎవరు వస్తార అని ఎదురుచూస్తున్నారని ఆయన అన్నారు.అందులో భాగంగా ఖమ్మం జిల్లాలో కూడా రాపిడో లాంటి ప్రైవేట్ సంస్థలు వస్తున్న పరిస్థితి కనిపిస్తుందని ఆయన అన్నారు.. ఇప్పటికే కిరాయిలు లేక ఇబ్బంది పడుతున్న ఆటో కార్మికులకు రాపిడో లాంటి సంస్థలు గుది బండగ మారాయని ఆయన అన్నారు.. రవాణా కార్మికులకు ఓలా ఉబర్ లాంటి ప్రైవేట్ యాప్ రద్దుచేసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం టి యు యాప్ ప్రవేశపెడతానని కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం 10 లక్షల రూపాయలు కల్పిస్తానని హామీ ఇచ్చినటువంటి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే హామీలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్న ఇప్పటివరకు రవాణా రంగ కార్మికుల పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రిగాని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కానీ స్పష్టమైన ప్రకటన చేయకపోవడం వల్ల ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు పక్కన ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆటో కార్మికులకు జీవన భృతి చెల్లించినప్పుడు మరి తెలంగాణ రాష్ట్రంలో జీవన భృతి ఎందుకు చెల్లించరని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.. ఆటో కార్మికుల ప్రయాణం మొత్తం రోడ్డుమీదనే ఉండటంవల్ల వారి యొక్క జీవనం ప్రశ్నార్థకంగా మారిందని వారి సంక్షేమం కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఒక సమగ్ర చట్టం చేయాలని ఆయన సందర్భంగా డిమాండ్ చేశారు.రవాణా రంగ కార్మికులకు గుది బండగ మారిన 2019 మోటార్ వాహనాల చట్టాన్ని రద్దు చేయాలని ఆయన సందర్భంగా డిమాండ్ చేశారు.. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీ జీవన భృతి 12000 వెంటనే చెల్లించాలని సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కార్మికులకు అనువైన చోట అడ్డా లు ఏర్పాటు చేయాలని ఆయన ఈ సందర్భంగా కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో: ఐ ఎన్టియూసి పాల్వంచ కృష్ణ, సీఐటీయూ జిల్లా ఉపేందర్, ఏఐటియూసి పేరబోయిన మోహన్రావు,బిఆర్టియూ షేక్ సత్తార్ ,టి యూ సి ఐ శ్రీను, నాయకులు ఆజాద్ , నాగరాజు, దేవ, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి పురపోరులో ఆమెది ఓ ప్రత్యేకత"

**సమాజంలో రుగ్మతపై పోరు చేసిన కుటుంబం"**

**నాడు పంచాయతీలో ప్రజాభిమానం పొందిన కుటుంబం"**

**నేడు గులాబీ మద్దతుతో 19 వార్డు బరిలో పాకలపాటి లక్ష్మీ"**




సత్తుపల్లి,ఆర్ సి,ఫిబ్రవరి06(తెలుగుగళం)న్యూస్: ఈ నెల 11న జరగనున్న సత్తుపల్లి పుర పోరులో బరిలో ఉన్న కౌన్సిలర్ అభ్యర్థులలో అందరిలో ఆమెది ఓ ప్రత్యేకత.ఆమె 19 వార్డులో బిఆర్ఎస్ బలపరిచిన సీపీఎం అభ్యర్థిని పాకలపాటి లక్ష్మీ.ప్రజాసేవ చేయడం పాకలపాటి కుటుంబానికి కొత్తేమీ కాదు.నాడు సత్తుపల్లి గ్రామ పంచాయతీగా ఉన్న కాలంలో తెలుగుదేశం మద్దతుతో 06 వార్డులో పాకలపాటి ఝాన్సీ గెలుపొంది ప్రజాబివృద్ధికి పాటు పడిన నేపథ్యం ఉంది.ప్రస్తుత 19 వార్డు అభ్యర్థినిగా బరిలో ఉన్న పాకలపాటి లక్ష్మీ ఝాన్సీ తోటి కోడలు కావడం విశేషం.అసలు పాకలపాటి వసంతరావు,బేబీ లు గత నలభైఏళ్లుగా నమ్మిన పార్టీ సీపీఎం కోసం కడవరకు పని చేస్తూ సీపీఎం ప్రజా సంక్షేమం కోసం చేసిన ప్రతి పోరాటంలో ముందుండి తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆదర్శ కుటుంబం.వారి ద్వితీయ కుమారుడు పాకలపాటి మల్లికార్జునరావు పట్టణంలో వ్యాపార రంగంలో మంచి పేరు తెచ్చుకున్న నిజాయితీ కలిగిన వ్యాపారిగా పేరు పొందిన వ్యక్తి,అంతే కాకుండా సివిల్ కాంట్రాక్టర్ గా కాంట్రాక్ పనులు చేయడమంటే లాభం కోసం కాదు అది కూడా ప్రజలకు,సమాజానికి సేవ చేసే సువర్ణావకాశంగా బావించి ఎక్కడ ప్రభుత్వ భవనాలు నిర్మించిన నాణ్యతలో లోపాలు లేకుండా నిర్మించి ప్రభుత్వాల వద్ద మంచి గుర్తింపు పొందిన ఉత్తమ కాంట్రాక్టర్ గా పేరు గాంచారు.అయినప్పటికీ సమాజంలో మహిళలపై జరుగుతున్న అనేక రుగ్మతలపై అనేక పోరాటాలు చేసిన గుర్తింపు కలిగిన మహిళా ఉద్యమకారురాలుగా గుర్తింపు కలిగిన కుటుంబం.సీపీఎం పార్టీ నేర్పిన ఉక్కు క్రమశిక్షణలో జీవిస్తున్న మార్పు కోరకు పోరులో భాగస్వామ్యం అవుతున్న కుటుంబం పాకలపాటి లక్ష్మీ కుటుంబం. ఏ మాటలు వెనుక ఏ అర్థాలు దాగి ఉన్నాయో గ్రహించి ప్రజలకు సుపరిపాలన అందించడం ఉగ్గుపాలతో పెట్టిన విద్యగా ఉన్న కుటుంబం. ఇది మిగిలిన కౌన్సిలర్ అభ్యర్థులకు పాకలపాటి లక్ష్మీ కు వ్యత్యాసం.ఈ నెల 11న జరగనున్న పుర పోరులో బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థినిగా మరోసారి ప్రజా సేవ చేయడానికి పాకలపాటి లక్ష్మీ 19 వ వార్డులో బరిలో నిలిచారు.అందుకని వార్డులోని విజ్ఞులైన ఓటర్లు లక్ష్మి ఎన్నికల గుర్తు సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓటేసి గెలిపించడం అందరి శ్రేయస్సుగా బావించి గెలిపించాలిసిన బాధ్యత ఉంది.అయితే పాకలపాటి లక్ష్మీ నాడు ఉమ్మడి నియోజకవర్గంలో అశ్వారావుపేట, దమ్మపేట మండలాలలో సీపీఎం ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేసి పేదలకు భూములు పంచిన, కూలీరేట్లు పెంచించిన ప్రజా బాంధవుడు గరిమెళ్ళ వెంకటేశ్వరరావు కుమార్తె పాకలపాటి లక్ష్మీ అనే విషయాన్ని చివరగా తెలుపుతున్నాను. లక్ష్మీ నివసించే వీధికి ప్రపంచ విప్లవకారుడు మహాత్ముడు లెనిన్ పేరు ను నామకరణం చేయించి అందరి నోట లెనిన్ తెలిసేలా చేసిన కుటుంబశీ.

# యల్బీనగర్‌లో అత్యాధునిక సదుపాయాలతో వెల్నాక్స్ రిహాబిలిటేషన్ సెంటర్ ప్రారంభం

## ముఖ్య అతిథిగా మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

తెలుగు గళం న్యూస్ రంగారెడ్డి: రంగారెడ్డి జిల్లా యల్బీనగర్‌లో అత్యాధునిక వైద్య సదుపాయాలతో నిర్మించిన వెల్నాక్స్ రిహాబిలిటేషన్ సెంటర్ను మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఈరోజు ఉదయం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరై సంస్థ నిర్వాహకులను అభినందించారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఐటి శాఖామాత్యులు డి. శ్రీధర్ బాబు, స్థానిక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ మాజీ ఆరోగ్య శాఖామాత్యులు మరియు ప్రస్తుత కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పత్తిపాటి స్వాతి సహా వైద్య నిపుణులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ పత్తిపాటి స్వాతి మాట్లాడుతూ, ఈ సెంటర్‌లో అధునాతన రోబోటిక్ ఫిజియోథెరపీ, ఆక్వా థెరపీ, ఐసీయూ యూనిట్‌తో పాటు పునరావాసానికి అవసరమైన పలు ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ప్రమాదాలు, స్ట్రోక్, నర సంబంధిత సమస్యలు, శస్త్రచికిత్సల అనంతరం కోలుకుంటున్న రోగులకు సమగ్ర చికిత్స అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో సేవలు అందిస్తూ, రోగులకు వేగవంతమైన ఆరోగ్య పునరుద్ధరణ కల్పించేందుకు ఈ కేంద్రం కృషి చేస్తుందని తెలిపారు.ప్రారంభోత్సవ కార్యక్రమంలో అతిథులు మాట్లాడుతూ, ఇటువంటి ఆధునిక రిహాబిలిటేషన్ కేంద్రాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, వైద్యరంగ అభివృద్ధికి దోహదపడతాయని అభిప్రాయపడ్డారు.యల్బీనగర్ ప్రాంతంలో ఈ కేంద్రం ప్రారంభం కావడం స్థానికులకు పెద్ద వరమని కొనియాడారు.




# ఆదరించి ఆశీర్వదించండి-చాగల్లు 9వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతా-సొదరపల్లి సంపత్ రాజ్

తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్ ఫిబ్రవరి 06: జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చాగల్లు గ్రామం 9వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సొదరపల్లి సంపత్ రాజ్ ఎన్నికల ప్రచారాన్ని ఉత్సాహపూరితంగా కొనసాగిస్తున్నారు.ప్రచారంలో భాగంగా వార్డు పరిధిలో ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లతో ఆత్మీయంగా మమేకమై వారి సమస్యలను ఓపికగా వింటూ, అభివృద్ధి కోసం తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.యువ నాయకుడిగా ప్రజల్లోకి వెళ్లి నేరుగా మద్దతు కోరుతున్న సంపత్ రాజ్‌కు పలుచోట్ల వార్డు ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాజకీయాలు తనకు పదవి కోసం కాదని-ప్రజాసేవ కోసం అని స్పష్టం చేశారు.9వ వార్డు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే ప్రజల మనిషిగా నిలబడటం తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు.ఎమ్మెల్యే, ఎంపీ సహకారంతో ప్రత్యేక నిధులు తీసుకువచ్చి వార్డులో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి చాగల్లు 9వ వార్డును మున్సిపాలిటీలో ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.ప్రత్యేకంగా ఎస్సీ, బీసీ కాలనీల్లో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సమస్య, వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి ప్రాథమిక సౌకర్యాలను ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరిస్తానన్నారు. ప్రతి వీధిలో మౌలిక వసతులు కల్పించి, పరిశుభ్రమైన వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేస్తానని తెలిపారు.గత ఐదారు సంవత్సరాలుగా కడియం యువసేనలో చురుకుగా పనిచేస్తూ యువత సమస్యలు, నిరుద్యోగుల సమస్యలు, సామాజిక కార్యక్రమాల్లో ముందుండి సేవ చేస్తున్నానని గుర్తు చేశారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపడంలో ఎప్పుడూ వెనుకడుగు వేయలేదన్నారు. అదే సేవాభావంతో ప్రజాప్రతినిధిగా మరింత సమర్థంగా పని చేస్తానని చెప్పారు.ప్రజలు తనపై విశ్వాసం ఉంచి అధిక మెజార్టీతో గెలిపిస్తే ప్రతి కుటుంబానికి కొడుకులా, అన్నలా, తమ్ముడిలా నిలబడి వారి కష్టసుఖాల్లో తోడుగా ఉంటానని స్పష్టం చేశారు. వార్డులో యువతకు క్రీడా సదుపాయాలు, మహిళలకు సంక్షేమ కార్యక్రమాలు, వృద్ధులకు అవసరమైన సహాయ కార్యక్రమాలు తీసుకురావడమే తన లక్ష్యమన్నారు.అభివృద్ధి, పారదర్శకత, అందుబాటు పాలన అనే మూడు సూత్రాలతో ముందుకు సాగుతానని పేర్కొంటూ, వార్డు ప్రజలందరికీ శిరసు వంచి నమస్కరిస్తూ అభివృద్ధి కోసం తనకు ఓటు వేసి ఆశీర్వదించాలని సంపత్ రాజ్ కోరారు.


# ములాఖాత్ లో పగడాల నాగరాజు ను పరామర్శించిన జిల్లా బిఆర్ఎస్ నాయకులు తోట రామారావు






తెలుగు గళం న్యూస్, ఖమ్మం పట్టణం/ ఫిబ్రవరి 06, ఖమ్మం జిల్లా: తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రివర్యులు శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారికి సిట్ విచారణతో ప్రభుత్వం చేస్తున్నటువంటి ద్వంద వైఖరికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బిఆర్ఎస్ ఇచ్చిన నిరసన పిలుపుమేరకు ఖమ్మం పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షులు పగడాల నాగరాజు పాల్గొని నిరసన తెలియజేస్తున్న సందర్భంలో జరిగిన తోపులాటలో పోలీస్ అధికారులు అక్రమంగా అరెస్టు చేసి రిమాండ్ చేయటం జరిగింది. గత మూడు రోజుల నుంచి ఖమ్మం జిల్లా కేంద్ర కారాగారంలో ఉన్న పగడాల నాగరాజును శుక్రవారం జిల్లా బిఆర్ఎస్ నాయకులు తోట రామారావు ములాఖాత్ సందర్శనలో భాగంగా ఈరోజు వారిని కలిసి మేమంతా ఉన్నాం అన్న ధైర్యాన్ని కల్పించి వారికి సంఘీభావం తెలియజేయడం జరిగింది. ఈ ములాఖాత్ కార్యక్రమంలో మాజీ కాన్సిల్ సభ్యులు వంగాల వెంకట్, డివిజన్ అధ్యక్షులు చేతి కృష్ణ, కిషన్ నాయక్,బాబా,నరసింహారావు, పెంటు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# జగన్ ఇబ్రహీంపట్నం పర్యటనలో మరొకరు మృతి



ఏపీ న్యూస్, 06 ఫిబ్రవరి (తెలుగుగళం న్యూస్): వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నం పర్యటనలో మరో విషాదం చోటు చేసుకుంది. ఇప్పటికే ఈ పర్యటనలో వైసీపీ కార్యకర్త రాంబాబు గుండెపోటుతో మరణించిన సంగతి తెలిసిందే. కాగా మరో యువకుడు బైక్ స్టంట్ చేస్తూ రోడ్డుపై బార్ గేట్ ను గుద్దుకుని మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తిని భార్గవ్ గా గుర్తించారు. ఇదిలా ఉంటే జగన్ మాజీ మంత్రి జోగి రమేష్ కుటుంబాన్ని పరామర్శించేందుకు ఇబ్రహీంపట్నంకు వెళ్లారు. అక్కడ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అయితే జగన్ పర్యటనకు పర్మిషన్ లేదని పోలీసులు చెబుతున్నారు. పరామర్శల సమయంలో పెద్ద ఎత్తున ప్రజలు వస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పోలీసులు ఓ నోట్ కూడా విడుదల చేశారు. వైసీపీ ముందుగానే జగన్ పర్యటన రూట్ మ్యాప్ విడుదల చేసిన నేపథ్యంలో పోలీసులు ఈ నోట్ రిలీజ్ చేశారు.

